క్లుప్తంగా

వైభవంగా మహాభారత ఉత్సవాలు



హరికథను ఆలపిస్తున్న భాగవతారిణి గీతావాణి

చంద్రగిరి : మండలంలోని నరసింగాపురంలో పది రోజులుగా మహాభారత ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం ఈ మేరకు ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భాగవతారణి గీతావాణి బృందం ఆధ్వర్యంలో సైంధవ పరాభవం హరికథా కాలక్షేపం జరిపించారు. రాత్రి రాజసూయ యాగం నాటికను ప్రదర్శించారు. మంగళవారం రాత్రి ద్రౌపదీమాన సంరక్షణ నాటిక ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మెనూ మేరకు పోషకాహారం

చంద్రగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నిత్యం మెనూ మేరకు పోషకాహారం అందించాలని ఎంఈఓ–2 భాస్కర్ బాబు ఆదేశించారు. సోమవారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న వంట కార్మికులకు ఒక్క రోజు శిక్షణ, వంటల పోటీలు నిర్వహించారు. ఎంఈఓ–2తో పాటు టాటా ట్రస్ట్ వీసీ అమరావతి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కింద పిల్లలకు నాణ్యమైన ఆహారం వడ్డించడమ అందరి బాధ్యతని వెల్లడించారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం వంటల పోటీల విజేలతకు బహుమతులు పంపిణీ చేశారు.

ఇళ్ల కూల్చివేతపై నిరసన



కలక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నేతలు

తిరుపతి అర్బన్ : మండలంలోని తిరుమలనగర్ పంచాయతీ వేణుగోపాల్ కాలనీలో పేదల ఇళ్ల కూల్చివేతపై సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, ఆర్పీఐ అధ్యక్షుడు అంజయ్య ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఇళ్లు కూల్చేసిన రౌడీలపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. వారు మట్లాడుతూ అర్ధరాత్రి 300 మంది రౌడీలు ఏడు జేసీబీలతో వచ్చిన 300 ఇళ్లను ధ్వంసం చేసిన ఐఆర్ఎస్ అధికారి శ్రీరాజన్ బాబు, సి.నిర్మల, న్యాయవాది రమణారెడ్డి, చంద్రగిరి మస్తాన్, ముని రెడ్డిపై కేసులు నమోదు చేయాలని కోరారు. ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమని మండపడ్డారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడు రుద్ర గోపి, బండి శ్రీనివాసులు రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేతలు కె.వేణుగోపాల్, ఎస్.మాధవ, పి.బుజ్జి పాల్గొన్నారు.

'నిరంతర యోగా' ప్రారంభం

తిరుపతి తుడా : నగరపాలక సంస్థ, తుడా ఆధ్వర్యంలో పతంజలి యోగా సమితి పర్యవేక్షణలో అంతర్జాతీయ యోగ దినోత్సవంలో భాగంగా 15రోజుల నిరంతర యోగా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ మేరకు ఇందిరా మైదానంలో ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు ఉచితంగా యోగా శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో తుడా సెక్రటరీ డాక్టర్ ఎస్వీ శ్రీకాంత్ బాబు, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, పతంజలి యోగ సమితి జిల్లా అధ్యక్షుడు కైలాస సింగ్ రాజ్ పురోహిత్, భారత స్వాభిమాన్ జిల్లా అధ్యక్షుడు ఓటేరి కృష్ణ, ప్రభాకర్, తంగరాజు, హరి, సంకల్ప సోమేశ్వర్, రవి, ఉమా, గంగాధరం పాల్గొన్నారు

'గ్రీవెన్స్'కు 23 వినతులు



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

తిరుపతి తుడా : తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు 23 వినతులు వచ్చినట్లు అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి తెలిపారు. ఫోన్ ద్వారా నలుగురు, 19 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారని వెల్లడించారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎంఈలు తులసి కుమార్, గోమతి, రెవెన్యూ అధికారి సేతుమాధవ్ పాల్గొన్నారు.

భర్త పై కోపంతో ఆత్మహత్య

తిరుపతి క్రైమ్: నగరంలో నివాసముంటున్న ఓ మహిళ భర్తపై కోపంతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. అలిపిరి ఎస్ఐ నాగార్జున తెలిపిన వివరాల మేరకు.. రామచంద్ర నగర్‌లో నివాసముంటున్న జనార్దన్ తాపీ మేస్త్రి. భార్య తులసి(35), ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు వచ్చేవి. ఈ క్రమంలో తులసి రెండుమూడు సార్లు ఆత్మహత్య చేసుకుంటానంటూ భర్తను బెదిరించింది. ఇదేవిధంగా ఆదివారం కూడా వీరి మధ్య చిన్నపాటి గొడవ చోటుచేసుకుంది. ఈ క్రమంలో తులసి ఇంట్లో ఎవరికీ తెలియకుండా విషం తాగింది. గమనించిన భర్త ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందింది. దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

ఆరంభం.. బ్రహ్మోత్సవం

శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ధ్వజారోహణంతో వైభవంగా ఆరంభమయ్యాయి. ముందుగా స్వామివారు, ధ్వజపటం, చక్రత్తాళ్వార్, పరివార దేవతలు బంగారు తిరుచ్చిపై కొలువుదీరి మాడ వీధుల్లో విహరించారు. ఉదయం 7.02 నుంచి 7.20 గంటల నడుమ మిథున లగ్నంలో గరుడ చిత్రంతో కూడిన ధ్వజపటం ప్రతిష్ఠించారు. అనంతరం శాస్త్రోక్తంగా శ్రీవారి ఆస్థానం చేపట్టారు. 10 నుంచి 11 గంటల వరకు కల్యాణ మండపంలో స్నపన తిరుమంజనం జరిపించారు. తొలి రోజు రాత్రి స్వామి వారు పెద్దశేషవాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కళాబృందాల కోలాటం, భజనల నడుమ ఊరేగింపు సాగింది. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, డిప్యూటీ ఈఓ వీఆర్ శాంతి, ఏఈఓ కె.మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

– తిరుపతి కల్చరల్




పెద్దశేషవాహనంపై ఊరేగుతున్న దేవదేవుడు

ఆడబిడ్డకు శఠగోపం!

అధికారం కోసం మాయమాటలు చెప్పడంతో చంద్రబాబు కాకలు తీరారు. ఓట్ల కోసం అలవి కాని హామీలు గుప్పించడంతో పండిపోయారు. పీఠం ఎక్కిన తర్వాత ప్రజలను బురిడీ కొట్టించడంలో పీహెచ్‌డీ చేశారు. ఈ విషయంలో ప్రధానంగా మహిళలకు ఘనత వహించిన బాబుగారి నైజంపై స్పష్టమైన అవగాహన ఉంది. అయితే మారిన మనిషిని అని ఊదరగొట్టడంతో 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో మరోసారి చంద్రబాబు విసిరిన పథకాల ఉచ్చులో చిక్కుకున్నారు. మహాశక్తి పథకం కింద ఆడబిడ్డ నిధి పేరిట ప్రతి అతివకు నెల నెలా రూ.1,500 అందిస్తామన్న బూటకపు మాటలకు పడిపోయారు. కూటమికి ఓట్లు కుమ్మరించారు. ఇంకేముంది బాబుగారు మళ్లీ తన నిజస్వరూపం బయటపెట్టేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఏడాది గడుస్తున్నా.. ఇప్పటికీ సదరు పథకం ఊసే ఎత్తకుండా కాలక్షేపం చేస్తున్నారు. ఇటీవల కడపలో నిర్వహించిన మహానాడు సందర్భంగా అయినా ఆడబిడ్డ నిధిపై ప్రకటన చేస్తారని లక్షల మంది అక్కచెల్లెమ్మలు ఎదురు చూశారు. అయితే ఎలాంటి స్పష్టత ఇవ్వకుండా ఆడపడుచులకు నిరాశనే మిగిల్చారు.

- ప్రతి నెలా రూ.1,500 చొప్పున అందిస్తామని మోసం
- అమలుకు నోచుకోని మహాశక్తి పథకం
- ఏడాది గడిచినా హామీ ఊసే ఎత్తని ప్రభుత్వం
- ఇప్పటికే ఒక్కో మహిళకు రూ.18వేల బకాయి
- తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో 3.20లక్షల మంది ఎదురుచూపు



తిరుపతి సిటీ : ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి మహిళలకు శఠగోపం పెట్టేశారు. 2014 ఎన్నికలప్పుడు డ్వాక్రా రుణాల మాఫీ పేరుతో మోసం చేశారు. మళ్లీ 2019 ఎన్నికల సమయంలో మహాశక్తి పథకం కింద ప్రతి నెలా ఆడబిడ్డలకు రూ.1,500 చొప్పున వారి ఖాతాలో జమ చేస్తామని టోపీ పెట్టేశారు. చంద్రబాబు తీరుపై మహిళలు మండిపడుతున్నారు.

రూ.602.72 కోట్ల బకాయి

తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో 18 ఏళ్లు పైబడిన మహిళలు సుమారు 3,38,737 మంది ఉన్నారు. వీరికి ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18వేలు చెల్లించాల్సి ఉంది. అంటే ఇప్పటికే లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.602.72 కోట్ల బకాయి పడింది. ఈ క్రమంలో పథకం అమలుపై కనీసం మహానాడులో అయినా ప్రకటన చేస్తార,ని ఆశించిన మహిళలకు నిరాశే మిగిలింది. చంద్రబాబు చేసిన మోసంపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కూడా స్పందించకపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు.

నమ్మి ఓటు వేశాం



మా ఇంట్లో 18 ఏళ్లు నిండిన ఆడవాళ్లం ముగ్గురు ఉన్నాం. నేను దినసరి కూలీని. ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన నేతలు ఇంటింటికీ తిరిగి చంద్రబాబు సీఎం అయితే ఆడబిడ్డ నిధి పథకం కింద కుటుంబంలోని ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని చెప్పారు. దీంతో నమ్మి ఓటు వేశాం. ఇంతవరకు రూపాయి కూడా ఇవ్వలేదు. సంవత్సరం గడిచింది. మా కుటుంబంలో ముగ్గురికి కలిపి నెలకు రూ. 4,500 చొప్పున ఏడాదికి రూ. 54వేలు రావాల్సింది.

– శివమ్మ, దినసరి కూలీ, తిరుపతి

మాటకు కట్టుబడాలి



ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలి. ఆడబిడ్డ నిధి కింద కుటుంబంలోని ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని కూటమి నేతలు ప్రకటించారు. దీంతో పెద్ద సంఖ్యలో మహిళలు ఆ పార్టీలకు ఓట్లు వేసి గెలిపించారు.ఎంతో నమ్మకంగా ఇచ్చిన అధికారాన్ని అంతే నమ్మకంతో ఇచ్చిన మాటకు కట్టుబడి పథకాలను అమలు చేయాలి. ఏడాదిగా బకాయి పడ్డ రూ.18వేలను తక్షణం చెల్లించాలి.

– సావిత్రి, గృహిణి, తిరుపతి

తక్షణం చెల్లించాలి



గత ఏడాదిగా ఆడబిడ్డ నిధి పథకం అమలు కాకపోవడం దారుణం. మహిళలకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తక్షణం అమలు చేయాలి. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తోంది. కానీ ఇంత వరకు ఆడబిడ్డ నిధి మాట కూడా ఎత్తలేదు. మహానాడులో ప్రకటిస్తారని విశ్వసించాం. కానీ ఆ ఊసే ఎత్తకపోవడంతో నమ్మకం సన్నగిలింది. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ఆపేశారు. చేతిలో చిల్లిగవ్వలేదు.

– ప్రభావతమ్మ, కూలీ, తిరుపతి రూరల్

ఇంకెప్పుడు ఇస్తారు?



సార్వత్రిక ఎన్నికల సమయంలో అకూటమి నేతలు మహిళలను మభ్యపెట్టి పథకాలను ప్రకటించి అమలు చేసి తీరుతామంటూ ప్రగల్భాలు పలికారు. అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా పథకాల ప్రస్తావనే తీసుకురావడంలేదు. ఉచిత బస్సుతో పాటు ఆడబిడ్డ నిధిని అమలు చేయలేదు. లక్షల మంది మహిళలు ఆడబిడ్డ నిధికోసం ఎదురు చూస్తున్నారు. ఇంకెప్పుడిస్తారో..పరమాత్మునికెరుక.

– పరమేశ్వరి, ప్రైవేటు పాఠశాల వర్కర్, తిరుపతి

'జేఈఈ అడ్వాన్స్‌డ్'లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న నారాయణ విద్యాసంస్థ డీజీఎం కొండలరావు తదితరులు



ఎం.మహేష్, టి.హరజిత్, పి.నిఖిలేశ్వర్

తిరుపతి ఎడ్యుకేషన్ : ఐఐటీ–జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తిరుపతిలోని పలు విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఐఐటీలో సీట్లు పొందేలా ఉత్తమ ర్యాంకులు సాధించారు.

'నారాయణ' ప్రభంజనం

నారాయణ విద్యాసంస్థ విద్యార్థులు ఓపెన్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ కేటగిరీలో జాతీయ స్థాయి ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారు. సోమవారం ఈ మేరకు డీజీఎం కొండలరావు మాట్లాడుతూ ఓపెన్ కేటగిరీలో ఎం.భానుచరణ్‌రెడ్డి జాతీయ స్థాయిలో 51వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ 4వ ర్యాంకు, డి.మణిదీప్‌రెడ్డి ఓపెన్ కేటగిరీలో 345వ ర్యాంకు, జి.హిమేష్‌రాఘవ చంద్ర 468, ఓబీఎస్ కేటగిరిలో 61వ ర్యాంకు, ఎం.శశాంక్‌రెడ్డి ఓపెన్‌లో 618, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 40వ ర్యాంకు, కె.యశ్విత ఓపెన్‌లో 906, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 67వ ర్యాంకు సాధించినట్లు వివరించారు. అనంతరం విద్యార్థులను కోర్ డీన్ శ్రీనివాసరావు, డీన్ వేణుగోపాల్, ప్రిన్సిపల్ సురేష్, ఏజీఎం గోపీచంద్ అభినందించారు.

శ్రీధర్స్ అకాడమీ విజయకేతనం

ఐఐటీ–జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తిరుపతి ఎయిర్ బైపాస్‌రోడ్డులోని శ్రీధర్స్ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేసినట్లు ఆ సంస్థ చైర్మన్ మద్దినేని శ్రీధర్ తెలిపారు. ఓపెన్, వివిధ కేటగిరీల్లో ఎం.మహేష్ 114, టి.హరజిత్ 1505, పి.నిఖిలేశ్వర్ 3312, కె.హర్షా 7214, ఎం.లీషితా 9750 ర్యాంకులను సాధించినట్లు వెల్లడించారు.

'అశ్వమేధ' ప్రతిభ



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్లు

ఐఐటీ–జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తిరుపతిలోని అశ్వమేధ జూనియర్ కళాశాల విద్యార్థులు వివిధ కేటగిరీల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభ చాటినట్లు సంస్థ డైరెక్టర్లు అబ్దుల్ ఇష్రత్, టీఎం.గోవర్ధన్ తెలిపారు. పి.నిఖిల్ 287, వి.సిద్ధార్థ 2095, కె.యశశ్రీ 2755, డి.శ్రీవైష్ణవి 3872, ఎస్.సుభద్రసాహితి 4011, సీవీ రేవంత్ 4530, జి.వెంకటరెడ్డి 4627, ఎస్.వెంకట్ సాయి 4699వ ర్యాంకులు సాధించినట్లు వివరించారు. పరీక్షకు రాసిన 15మంది విద్యార్థుల్లో 9మంది ఐఐటీలో సీట్లు సాధించినట్లు వెల్లడించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాళ్లు సుమతి, రామయ్య అభినందించారు.

యోగాసనాల్లో పతకాల పంట



అవార్డు అందుకుంటున్న లలితకుమారి



పతకాలతో దీపిక

తిరుపతి సిటీ : నగరంలోని కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న అక్కాచెల్లెలు చీమలమర్రి లలితకుమారి, చీమలమర్రి దీపిక యోగాసనాల్లో రాణిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో బంగారు, వెండి, కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. ప్లస్–2 విద్యార్థిని లలితకుమారి ఇటీవల కర్ణాటక, దవణగిరిలో జరిగిన పోటీలలో 'యోగా శ్రేయ్' జాతీయ అవార్డు అందుకుంది. రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలలో కాంస్య పతకం సాధించింది. ఆల్ ఇండియా యోగా కల్చర్ ఫెడరేషన్ పోటీలలోనూ 3వస్థానం సాధించి ప్రతిభను చాటింది. కూచిపూడి నృత్యంలో రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానం దక్కించుకుంది. త్వరలో జరగనున్న ఆల్ ఇండియా కల్చరల్ ఫెడరేషన్ జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. అలాగే చీమలమర్రి దీపిక ప్లస్–1 చదువుతూ గ్లోబల్ భారత్ టాలెంట్ సమ్మిట్‌లో బంగారు పతకం పొందింది. సప్తరిషి యోగా ధారా స్పోర్ట్స్ అకాడమీ పోటీలలో రెండవ స్థానం సాధించింది. నేయోగాసన జిల్లా స్థాయి పోటీలలో రెండు సార్లు బంగారు పతకం అందుకుంది. రాష్ట్ర స్థాయిలో టాప్ 8లో నిలిచింది. ఈమె కూడా జాతీయ స్థాయి యోగా పోటీలలో పాల్గొనేందుకు అర్హత సాధించింది.

గంజాయి విక్రేత అరెస్ట్

తిరుపతి క్రైమ్: ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. 2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితుడిని తమిళనాడుకు చెందిన పళనిస్వామి దీపక రఘునాథ్ గుర్తించినట్లు వివరించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

పాత తిరుచానూరు రోడ్డులోని అన్నపూర్ణమ్మ గుడి వద్ద పార్కింగ్ ప్రాంతంలో కర్ణాటక మద్యం ప్యాకెట్లు విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ వెల్లడించారు. నిందితులను తెలంగాణకు చెందిన వలపు నవీన్(32), శివకుమార్(24)గా గుర్తించామని వివరించారు.

జీప్ అపహరణ

తిరుపతి క్రైమ్: శ్రీగోవిందరాజ స్వామి ఆలయ సమీపంలోని పద్మావతి స్టాండ్‌లో జీప్ అపహరణకు గురైన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. యాదవ్ కాలనీకి చెందిన రామచంద్రారెడ్డి జీపులో అవిలాలకు చెందిన ఎల్లప్పరెడ్డి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి స్టాండ్‌లో వాహనం ఉంచి ఎల్లప్పరెడ్డి ఇంటికి వెళ్లిపోయాడు. ఉదయం చూసేసరికి జీప్ చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జీప్ విలువ సుమారు 3.90లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

'వెన్నుపోటు దినం' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, తదితరులు

తిరుపతి రూరల్ : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 4వ తేదీన వెన్నుపోటు దినం నిర్వహించనున్నట్లు పార్టీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఈ మేరకు వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరించారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టి అధికారంలోకి వచ్చాక మంగళం పాడేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ప్రజలను నిలువునా మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతి కార్యకర్త రోడ్డుపైకి రావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఊరు, ప్రతి పంచాయతీ, ప్రతి మండలం నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు తరలివచ్చి వంచన ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా గళం వినిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, సర్పంచ్ దామినేటి కేశవులు, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మునీశ్వరరెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెంచు మోహన్ యాదవ్, సి.ప్రసాద్, గోపాల్ రెడ్డి, ప్రసాద రెడ్డి, నాగభూషణమ్మ, మల్లారపు వాసు పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమావేశం

చంద్రగిరి మండలం నాగాలమ్మ కూడలి సమీపంలోని వైఎస్ఎంఆర్ కల్యాణ మండపంలోమంగళ వారం ఉదయం 10 గంటలకు నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు మోహిత్‌రెడ్డి తెలిపారు. ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి హాజరవుతారని వెల్లడించారు.

నోటీస్ బోర్డు

- జాతర తర్వాత మూడవ మంగళవారం తాతయ్యగుంట గంగమ్మ మరుపొంగళ్ల సమర్పణలో భాగంగా ఉదయం 7 గంటలకు ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం. .
- శ్రీగోవిందరాజస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 7 నుంచి 9 గంటల వరకు చిన్నశేష వాహనం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు హంస వాహన సేవ.
- అప్పలాయిగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం.

విద్యార్థుల కోసం 'సద్గమయ'



మాట్లాడుతున్న టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : హిందూ సనాతన ధర్మం బోధించి విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించే లక్ష్యంతో త్వరలోనే సద్గమయ పేరుతో వినూత్న కార్యక్రమం చేపట్టనున్నట్లు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. సోమవారం టీటీడీ పరిపాలన భవనంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. జేఈఓ మాట్లాడుతూ పిల్లల్లో సహనం, సానుభూతి, నిజాయితీ, కరుణ, విశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణ తదితర అంశాలను పెంపొందించేలా కార్యక్రమాన్ని రూపొందించాలన్నారు. విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉండే అంశాలను శిక్షణ షెడ్యూల్‌లో చేర్చాలని సూచించారు. ఈ మేరకు హెచ్‌డీపీపీ కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సద్గమయకు సంబంధించిన ప్రధాన అంశాలను వివరించారు. ఆల్ ప్రాజెక్టుల ప్రత్యేక అధికారి రాజగోపాల్, ఎస్ఈ మనోహరం, డీఈఓ వెంకట సునీల్, వీజీఓ సదాలక్ష్మి, సీఎంఓ డాక్టర్ నర్మద, అదనపు హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సునీల్, ఎలక్ట్రికల్ డీఈ సరస్వతి, ఎస్వీబీసీ ఓఎస్‌డీ పద్మావతి పాల్గొన్నారు.

ఫ్లెక్సీల నిషేధానికి డిమాండ్

తిరుపతి కల్చరల్ : నగరంలో పెరిగిపోతున్న ఫ్లెక్సీల సంస్కృతికి చెక్ పెట్టాలని, వాటిపై నిషేధం విధించాలని సీపీఎం జిల్లా నేత కందారపు మురళి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక క్షేత్రంలో ఫ్లెక్సీల గోల బారుణంగా తయారైందన్నారు. రాజకీయ నేతలు, ప్రజా ప్రతినిధులు, వ్యాపారులతోపాటు రౌడీ షీటర్లు, నేరస్తులు కూడా తమ అభిమానుల పేరుతో అడ్డదిడ్డంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని మండిపడ్డారు. వీటి కారణంగా పలు చోట్ల ట్రాఫిక్ ఇబ్బందులతోపాటు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

బర్డ్ డైరెక్టర్‌కు సత్కారం



జగదీష్‌ను సన్మానిస్తున్న ప్రకాష్‌రెడ్డి

తిరుపతి తుడా : బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జగదీష్‌ను రిమ్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.ప్రకాష్‌రెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. వృత్తిని దైవంగా భావించి పేదలకు సేవ చేసిన గొప్ప వైద్యుడు జగదీష్ అని కొనియాడారు.

ఘనంగా చెంచుమోహన్ జన్మదినోత్సవం



చెంచుమోహన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్ : వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెంచుమోహన్ యాదవ్ పుట్టినరోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, నేతలు మునీశ్వర రెడ్డి, మల్లారపు వాసు, నాగభూషణమ్మ, శశి, సి.ప్రసాద్, దేవ తదితరులు పాల్గొన్నారు.